బాచుపల్లి నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి



ప్రగతినగర్ ప్రధాన రోడ్డు ఇన్‌కాయిస్ సర్కిల్ సమీపంలో ఇలా..



గుంతల్లో మట్టి పోసి వదిలేసిన దృశ్యం



దారంతా గతుకులు!

అభివృద్ధి అని చెప్పుకుంటారు కానీ ఎక్కడ చూసినా నిర్లక్ష్యమే..

పట్టించుకోని అధికారులు - మరమ్మతులకు నోచుకోని రోడ్లు - రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలల తరబడి గుంతలమయంగా ఉన్న రోడ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కార్పొరేషన్ అభివృద్ధిలో దూసుకుపోతుందని అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రధాన రహదారులుగా ప్రగతినగర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ రోడ్డు, నిజాంపేట్ నుంచి బాచుపల్లి సిగ్నల్ రోడ్డు, బాచపల్లి సిగ్నల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ రోడ్డును చెప్పుకుంటారు. అయితే ఈ ప్రధాన రోడ్లపై ఎక్కడ చూసిన గుంతలే కనిపిస్తున్నాయి. ఈ రోడ్లపై నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అయినా వాటికి మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనికి తోడు బాచుపల్లి చౌరస్తాలో చేపట్టిన ఫ్లైఓవర్ పనులు మూలంగా రోడ్లు చిత్తడిగా మారి వాహనదారులకు నరకం కనిపిస్తోంది.

అంతర్గత రోడ్ల సంగతి అంతే..

ప్రధాన రోడ్ల పరిస్థితి అలా ఉంటే బస్తీల్లో, కాలనీల్లో ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఎక్కడ చూసినా గుంతలే.. డ్రైనేజీ మరమ్మతుల కోసం తవ్విన రోడ్లకు మరమ్మతులు చేయరు. రోడ్లను ఎవరికి అవసరం ఉంటే వారు ఇష్టానూసారంగా రోడ్లను తవ్వుకుని తమ అవసరాలను తీర్చుకున్నాక అలాగే వదిలేస్తారు. ఇక కేబుల్స్ వేయటానికి సైతం అక్కడక్కడ రోడ్లను తవ్వి వదిలేస్తారు. ఇక డ్రైనేజీ, మంజీరా పైపులైన్ పనుల కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తవ్విన రోడ్లకు సకాలంలో మరమ్మతులు చేయక నెలల తరబడి అలాగే ఉంచడంతో వర్షాలు పడ్డప్పుడు అంతర్గత రోడ్లపై సైతం గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

ప్రమాదలబారిన పడుతున్న వాహనదారులు..

రోడ్లపై ఏర్పడిన గుంతల మూలంగా వాహనదారులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా దిచక్ర వాహనదారులు ఎక్కువగా బాధితులు అవుతున్నారు. వర్షం పడిదంటే గుంతల్లో వరద నీరు చేరి గుంతలు కనిపించకపోవడంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. అంతే కాకుండా వాహనదారులకు గాయాలు సైతం అవుతున్నారు. అదే విధంగా గుంతల వల్ల వాహనాల వేగం కూడా తగ్గిపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో అనేక మందికి పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

గుంతలతో వెన్నునొప్పి...

ఈ రహదారులపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు వెన్నునొప్పి సమస్య తీవ్రంగా బాధపడుతున్నట్లు చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో వేగంగా వెళ్లాల్సి వస్తే ప్రమాదాల బారిన పడుతున్నామని పేర్కొంటున్నారు.



గుంతలమయంగా నిజాంపేట్ నుంచి బాచుపల్లి వెళ్లే ప్రధాన రహదారి



రాజీవ్ గాంధీనగర్‌లోని ప్రధాన రోడ్డు ఇలా..

అధికారులు నిద్రమత్తు వీడాలి



ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో అధికారులు ముందుటారు. కాని ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎందుకింత నిర్లక్ష్యం. రోడ్లు బాగ లేక ఇబ్బందులు పడుతున్నాం. గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నాం. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అసలే వర్షకాలం ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ గడ్డ ఉందో అర్థం కాని పరిస్థితి. భారీ వర్షాలు పడినప్పుడు జరిగే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారు. అధికారులు నిద్రమత్తు వీడాలి. - స్టాలిన్‌రెడ్డి

మరమ్మతులు చేయాలి



నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలి. రాజీవ్‌గాంధీనగర్ ప్రధాన రోడ్డు నిజాంపేట్ నుంచి బాచుపల్లి వైపు వెళ్లే రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలే ఉన్నాయి. గుంతల్లో అధికారులు కేవలం డస్ట్ పోయి తత్కాలికంగా పుడ్చుతున్నారు. శాశ్వత ప్రతిపాదికన మరమ్మతులు చేస్తే బాగుంటుంది. వర్షం పడిందంటే ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులతో పాటు స్థానికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. - మహేందర్, మాజీ వార్డు సభ్యుడు

ఆగస్టు 15లోపు రైతుల కష్టాలు తీరుతాయి

కాంగ్రెస్ నేత చౌడ శ్రీనివాసరావు



కుత్బుల్లాపూర్: హైదరాబాద్ నగర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించడం.. 100రోజుల ప్రణాళికలో భాగంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ నేత చౌడ శ్రీనివాసరావు అన్నారు. షాపూర్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతుల కష్టాలు తీరుతాయని అన్నారు. రుణమాఫీ ద్వారా ప్రతిపక్షాలకు అడ్రస్ లేకుండా పోతుందన్నారు. కేవలం తమ ఉనికి కోసం కొంతమంది నాయకులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. నగరంలో 'మత్తు'దించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు తీసుకొస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



సర్వేపల్లి రాధాకృష్ణా పార్కులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిజాంపేట్: పిక్సెల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ప్రగతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాసవీ లేవుట్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణా పార్కులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఉదయం పార్కుకు వాకింగ్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, యువకులు అన్ని వయస్సుల వారు ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారం రోజుల పాటు ఉచిత కంటి నరాల పరీక్షలు సైతం ఉచితంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ప్రతినిధులు నితీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉద్యోగుల వేతనాల పెంపునకు ఐఎన్‌టీయూసీ కృషి



యాజమాన్యం నుంచి ఒప్పంద పత్రం అందుకుంటున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

జీడిమెట్ల: ఐఎన్‌టీయూసీ చొరవ వలన జీడిమెట్లలోని మానస సరోవర్ అగ్రో సాక్స్ పరిశ్రమ ఉద్యోగులకు జీతాలు పెరిగాయి. జీడిమెట్లలోని మానస సరోవర్ పరిశ్రమలో బీహార్, యూపీ రాష్ట్రాలకు చెందిన కొంత మంది నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. వారికి కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, ఇవ్వకుండా కార్మికులతో పనిచేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఐఎన్‌టీయూసీ నాయకులు ఈ విషయాన్ని కొలను హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపారు. వారి డిమాండ్లకు అంగీకరించిన యాజమాన్యం ఒక్కో కార్మికుడికి రూ.4500 పెంచడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తించేలా చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు సయ్యద్ రషీద్, అధ్యక్షులు జయరాం, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తార్ అలీ, అర్వింద్‌కుమార్, పరిశ్రమ యాజమాన్యం పి.గోపాల్, పి.విష్ణు తదితరులు ఉన్నారు.

ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచాలి

అర్బన్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి అధ్యక్షుడు మల్లారెడ్డి



సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రం ఇస్తున్న మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ని కలిసారు. సుచిత్ర రైల్వేస్టేషన్‌కు సుచిత్ర వైపు రోడ్డు సౌకర్యం కల్పిస్తే వందల సంఖ్యలో ప్రయాణించే ఉద్యోగులకు ఉపయోగపడేలా ఉంటుందని తెలిపారు. కొంపల్లి అండర్ పాస్ రోడ్డు చాలా సంవత్సరాలుగా నిరూపయోగంగా ఉందన్నారు. అయోధ్య రోడ్డు వద్ద మేడ్చల్-మియాపూర్ రోడ్డుపై రైల్వేగేటు వల్ల నిత్యం ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతుందని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, కో-కన్వీనర్ శివాజీరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, గరిగె శేఖర్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్ సాగర్, చండి శ్రీనివాస్, ప్రసాద్, చక్రాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. బుధవారం కైసర్‌నగర్, బతుకమ్మ బండ, దేవేందర్‌నగర్ ప్రాంతాల్లో ఆయన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయినాథ్ నేత, రేవతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, బాలకృష్ణ, లక్ష్మణ్, రేవతి సింగ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు

జీడిమెట్ల: టీజీఐఐసీ సిద్దిపేట, మేడ్చల్ జోనల్ ఆఫీసర్‌గా అనురాధ బాధ్యతలు చేపట్టారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని టీజీఐఐసీ కార్యాలయంలో జోనల్ మేనేజర్‌కు జేఎన్ఎంఐఏఎస్ఎస్ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా కమిషనర్ నజీర్, సభ్యులు సదాశివరెడ్డి, పి.కృష్ణ, ఏఎల్ఎన్ రెడ్డి,పీడీఎస్ఎన్ రాజు,భాస్కరరాజు పాల్గొన్నారు.



జోనల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జేఎన్ఎంఐఏఎస్ఎస్ సభ్యులు

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొలుకుల జగన్

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం శ్రీనివాస్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్కూల్ ప్రహరీ, మరుగుదొడ్లు, ఆట స్థలం తదితర అంశాలపై పాఠశాల హెచ్‌ఎం కిషన్‌తో ఆయన చర్చించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌గౌడ్, ప్రకాష్, నరసయ్య, విటల్ ముదిరాజ్, సీహెచ్ దాసు, ఖలీల్, గోవర్ధన్, మహిపాల్, చంద్రకళ, శైలజ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సుభాష్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూశివాలయనగర్‌లోని అంబేడ్కర్ భవన్ వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. మృతుడిని గుర్తిస్తే వెంటనే సూరారం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

21న ఎల్లమ్మ, జమదగ్ని ముని కల్యాణం

నిజాంపేట్: ఆది జాంబవ అరుంధతీ మాత మహాశక్తి పీఠం ప్రాంగణంలోని లంద ఎల్లమ్మ దేవి జమదగ్ని ముని కల్యాణ మహోత్సవం ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ఆది జాంబవ అరుంధతీ మాత మహాశక్తి పీఠాధిపతి జాంభవ రాజయ్య గురువు ఓ ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని రాజధాని స్కూల్ పక్కన ఉన్న దేవాలయాల ప్రాంగణంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తెరుచుకోని వార్డు కార్యాలయాలు

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటున్న స్థానికులు



భగత్‌సింగ్‌నగర్‌లో మూసి ఉన్న వార్డు కార్యాలయం

చింతల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల పరిష్కార వేదిక ముణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. చిన్న చిన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చేసే విధంగా అన్ని విభాగాల అధికారులతో ప్రతి డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ వార్డు కార్యాలయాలు లోక్‌సభ ఎన్నికల అనంతరం తెరవడం లేదు. భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ ఫంక్షన్‌హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయం ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఇందులో సుమారు 7 విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారు. కానీ ఏ ఒక్క అధికారి కార్యాలయాన్ని తెరవకపోవడం గమనార్హం.

మానసికస్థితి సరిగా లేని మహిళ ఆత్మహత్య

సుభాష్‌నగర్: మానసికస్థితి సరిగా లేని ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన కృష్ణ, లావణ్య(40) భార్యాభర్తలు. వీరిద్దరూ స్థానికంగా బట్టలు, అల్లం-ఎల్లిగడ్డ వ్యాపారం నిర్వహిస్తుంటారు. లావణ్యకు కొన్ని రోజులుగా మానసిక పరిస్థితి సరిగా ఉండకపోవడంతో ఇంట్లోనే ఉంటోంది. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన లావణ్య సూరారంలోని లింగయ్య చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం లావణ్య మృతదేహం చెరువులో తేలడంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతురాలు లావణ్యగా గుర్తించారు. మృతురాలి భర్త కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న మహిళా మోర్చా నాయకులు, బీజేపీ నేతలు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఎనిమిది నెలలు పూర్తయినా హామీలను నెరవేర్చలేదని రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అర్కెల సుధా అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అశ్విన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆర్కెల సుధా మాట్లాడుతూ... మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఇస్తామన్న ప్రతినెల రూ.2500తో పాటు ఆరు నెలల బకాయిలు రూ.15వేలు వెంటనే ఇవ్వాలన్నారు. నవ వధువుకు ఇస్తామన్న తులం బంగారం డిసెంబర్ నుంచే అమలు చేయాలన్నారు. 18సంవత్సరాలు నిండిన కాలేజీకి వెళ్లే ప్రతి ఆడపిల్లకు ఇస్తామన్న స్కూటీలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.5లక్షల విద్యార్థి హామీ కార్డును వెంటనే అమలు చేయాలని, మహిళ పెన్షన్ రూ.4వేలు బకాయితో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అలివేలు, సాయినాథ్, రేవతి సింగ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

మల్లంపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

దుండిగల్: అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో ఇటీవల నిర్మించిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు సైతం ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలోని కమర్షియల్ బిల్డింగ్‌ను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ,టౌన్‌ప్లానింగ్ అధికారి సంజున, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలల్లోనే 74 జీవీ పాయింట్లు తొలగించారు



కుత్బుల్లాపూర్ సర్కిల్ కాకతీయనగర్ చింతల్ జీవీపీ వద్ద ముగ్గులు వేసిన దృశ్యం



ఉషోదయకాలనీ జీవీపీని తొలగించి స్థానికులతో క్యారంబోర్డు ఆడుతున్న సిబ్బంది

జగద్గిరిగుట్ట: నగర పరిశుభ్రత కోసం జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు కొత్త పంథా అవలంభిస్తున్నారు. వీధులలో చెత్త వేయకుండా ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోలోనే వేయాలని పలు అవగాహన సదస్సులు చేపడుతున్నారు. చెత్త వేసిన చోట ముగ్గులు వేస్తూ కొన్ని రోజులు, ఆ తర్వాత అక్కడే టీ పాయింట్ ఏర్పాటు చేసుకొని అక్కడే టీ తాగుతూ చెత్తను వేయకుండా కొంత నియంత్రించగలిగారు. అంతే కాకుండా మిగిలిన జీవీపీ (గార్బేజ్ వర్నలబుల్ పాయింట్స్) మొత్తం తొలగించడానికి గ్రేటర్ జీహెచ్ఎంసీ అధికారులు వివిధ వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. ఈ సమస్య పరిష్కరించడానికి కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తం నగర వ్యాప్తంగా 2450పైగా జీవీపీలు ఉన్నాయని గుర్తించారు.

- ఈ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడానికి సుమారు 1000 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించినట్లు తెలిసింది. ఈ సిబ్బంది చెత్తను ఆ పాయింట్ వద్ద వేయకుండా అరికట్టడానికి 3 షిఫ్టులుగా పని చేస్తూ అరికట్టడానికి నడం బిగించారు. దాదాపు 80శాతం వరకు సక్సస్ అయినట్లు తెలిసింది. గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లలో సుమారు 74 జీవీపీలు ఉండేవి. పక్కా ప్లానింగ్‌తో 2 నెలలలోపే దాదాపు మొత్తం పాయింట్‌లను ఎత్తేశారు. ఈ గార్బేజీ పాయింట్‌ల వద్ద టెంట్‌లు వేసుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్తను వేయకుండా అరికట్టగలిగారు.

పరికిచెరువు బఫర్ జోన్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు

స్థలంపై విచారణ పూర్తయ్యేంత వరకు పనులు చేపట్టొద్దని ఆదేశం



స్థలాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి రంగనాథ్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో పరికి చెరువు బఫర్ జోన్‌లో మన భూమ్ కన్స్‌ట్రక్షన్ చేపడుతున్న నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారి రంగనాథన్, రెవెన్యూ, స్థానిక జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం 6గంటలకు పరిశీలించారు. పరికి చెరువు బఫర్ జోన్ సర్వే నంబర్ 299, 300, 301, 298, 295లను పరిశీలించారు. సర్వే నంబర్ 300, 301, 298ల బఫర్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా మనభూమ్ కన్స్‌ట్రక్షన్ పేరిట చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకున్నారు. సదరు స్థలంపై విచారణ పూర్తయ్యేంత వరకు ఎలాంటి నిర్మాణం చేపట్టరాదని అధికారులను ఆదేశించారు. గతంలో ఈ విషయమై 'సాక్షి'వెలుగులోకి తీసుకురాగా అప్పటి అధికారులు కేవలం నోటీసులతో సరిపెట్టారు.



బఫర్ జోన్ లో కడుతున్నారని ఆరోపిస్తూ ఆపివేసిన నిర్మాణం ఇదే